# మంటలు

— నాగభైరవ

ఆ షాక్కో త్రారోడ్డు రోడ్డు పక్క మురికికాలువలు కాలువలకు ముందు ముసి వాళ్ళు కాలువల మీద బంకులు బంకుల్లో బ్రాకెట్టు ఆటలు రోడ్డుకు దూరంగా బ్రాందీ షాపులు వాటివెనుక "బారు"లు బారులకు దూరంగా సందులు ఆ సందుల్లో అమ్మకానికి అమ్మాయిలు ఆ అమ్మాయిలతో బాటు అనుభవాలు. అనుభవాలతో బాటు అంటు రోగాలు పుష్కలంగా వున్నాయి.

ఆ వూరికి దూరంగా పొగాకు కంపెనీ వుంది దాని చుట్టూ బెల్లం ముక్కను ముట్టుకున్న నల్ల చీమల్లా పూరిగుడిసెల్లో కూలి జనం. వాళ్ళంతా పగలు పొగాకు కంపెనీలో, రాత్రి గుడిసెల్లో కాలం గడుపుతుంటారు.

అమావాస్య. స్వార్థంలా పేరుకున్న కటిక చీకటి త్యాగబుద్ధిలా మసగ్గా వెలుగుతున్న వీధి దీపాలు కునుకుతున్నాయి. ఒక్కసారిగా చీకటి కడుపు చించుకొని బయట పడినట్టు వెలుగు అధికారి అహంకారంలా. పేదవాని ఆకలిలా మంటలు గుప్పుమన్నాయి. పైకి, పైపై — రోజు రోజుకి పెరుగుతున్న ధరల్లా మంటలు ఆకాశం అంటుతున్నాయి పొగాకు కంపెనీ తగలబడుతున్నది. పొగాకుతో పొగచూరి అలుముకొంటున్నది. నిద్రపోతున్న పాకల్లో జనం తట్టిలేపినట్లు లేచారు. అప్పటికే అగ్నికి ఆహుతి మయింది వంటి గుడ్డలు. తమ ప్రాణాలు తప్ప మరేమి రక్షించుకోవటానికి వీలులేక పోయింది వాళ్ళకి

పొగాకు కంపెనీ చుట్టూవున్న పాకలు బూడిదయ్యాయి. స్మశానంలా కనుపిస్తున్న ఆ చోటుకి గణ గణమంటూ పరుగులెత్తుకు వచ్చాయి ఫైరింజనులు. వాటిపని చేసి పోయాయి ఏది ఏమయితేనేం తెల్లవారే సరికి పొగాకు కంపెనీలేదు ఆ కంపెనీలో పనిలేదు కార్మికుల బ్రతుకు తెల్లవారబోతున్నది

నాలుగు రోజులు గడిచాయి ఇన్సూరెన్సు వాళ్ళు వచ్చి కాలిన కంపెనీ చూశారు. ప్రమాదం ఎలా సంభవించిందో విన్నారు. అది కేవలం యాదృచ్ఛికంగా జరిగిన ఘటన అని తేల్చేశారు. అధికారులు ప్రాంతీయ ఎం. ఎల్. ఎ తదితరులు వచ్చి జరిగిన దుర్ఘటనకు విచారం వెలిబుచ్చారు ఇక ఇలాంటివి జరగకుండా వుండటానికి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆపైన ఒక్కో కుటుంబానికి వంద రూపాయలు యిస్తున్నట్లు ప్రకటించారు. ప్రజలు హర్షధ్వానాలు చేశారు అయితే ఆ పాకల జనానికి గుర్తురానిది ఒకటే ఒకటి తాము పోగొట్టుకున్న పాత సామాను వంద రూపాయలకు వస్తుందా? అని

నెలరోజులు గడిచాక కూలీలకు వంద రూపాయలు చొప్పున అందాయి. పొగాకు కంపెనీకి పదిహేను లక్షలు అందాయి.

ముట్టవలసిన వారికి డబ్బు ముట్టింది. దాంతో అగ్ని ప్రమాదం యాదృచ్ఛికమని, కాలిపోయిన సరుకంతా పాతది. మేలురకం పొగాకంతా సమోవయింది. లక్షలు కంపెనీకి ముట్టాయి పొగాకు కంపెనీ కూలీలకు పని పోయి నష్టాలు దక్కాయి.

★